క్లుప్తంగా

కరోనా నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

జూలూరుపాడు: కరోనా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని జిల్లా సర్వోలెన్స్ అధికారి ఇమ్యూనేల్ అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కరోనా కేసులు, హోమ్ ఐసోలేషన్, టెస్ట్ కిట్స్, ఆర్‌టీపీసీఆర్ శాంపిల్స్ వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కుక్క, కోతి, పాము కాటులకు సంబంధించిన వ్యాక్సిన్, మందుల స్టాక్ వివరాలను ఫార్మసిస్ట్‌ను అడిగారు. ల్యాబ్‌ను సందర్శించి రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ కుమార్, ఫార్మసిస్టు జి శశికళ, ఎల్‌టీ ఎస్కే హఫీజ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సీతారాములు

సుజాతనగర్: క్రీడలు యువతకు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. కాసాని లక్ష్మి ఆరో వర్ధంతి సందర్భంగా 'కాసాని లక్ష్మి మెమోరియల్'ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ పోటీలను స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో మంగళవారం వారు ప్రారంభించారు. మాట్లాడుతూ.. యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. వైద్యులు డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, కాసాని ఐలయ్య, లిక్కి బాలరాజు, ధర్మ, వీర్ల రమేష్, భూక్యా దస్రు, యాస నరేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల వివరాలు నమోదు

జూలూరుపాడు: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేస్తున్నట్లు కొత్తగూడెం సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) టి.కరుణశ్రీ అన్నారు. మంగళవారం ఏడీఏ కరుణశ్రీ జూలూరుపాడు, వెంగన్నపాలెం, కరివారిగూడెం గ్రామాల్లో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు అకాల పంటలను సర్వే చేస్తున్నామన్నారు. ఏఓ ఎస్.రఘుదీపిక, ఏఈఓలు ఎంఏ గౌస్, బి.గోపికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పాల్వంచ: బ్రెయిన్ స్ట్రోక్ బాధితునికి వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆర్థిక సహాయం అందించారు. ములకలపల్లి మండల కేంద్రానికి చెందిన వందనపు జగదీశ్ లారీ డ్రైవర్. ఇతనిది నిరుపేద కుటుంబం. ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ములకలపల్లి వాసవీ క్లబ్ అధ్యక్షుడు బిక్కుమళ్ల సుధాకర్, పాల్వంచ వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాష్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ సభ్యుల సహకారంతో మంగళవారం రూ.35,500 బాధితుడి కుటుంబ సభ్యులకు అందించారు.

తునికాకు బోనస్ విడుదల చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.100 కోట్ల తునికాకు బోనస్‌ను తక్షణమే విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్‌పాషా కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బోనస్ విడుదల చేసిన ప్రభుత్వం భద్రాద్రి జిల్లాపై వివక్ష చూపడం సరికాదన్నారు. ఇకనైనా బోనస్ బకాయిలు చెల్లించడమే కాక 50 ఆకుల కట్టకు రూ.5 చెల్లించాలని, ఆకు సేకరణలో ప్రమాదాల బారిన పడి మృతి చెందిన కుటుంబాలకు రూ.25 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన

జూలూరుపాడు: మండలంలోని కొమ్ముగూడెం, కరివారిగూడెం, గిద్దెలగూడెం గ్రామాల్లోని మెయిన్, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ నిర్మలజ్యోతి ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు, గర్భిణులు, తల్లులు, స్టాక్ వివరాలను టీచర్లను అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం దృష్ట్యా పిల్లల పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు రామరాజ్యం, విజయ, వరలక్ష్మి, జ్యోతి, సుజాత, పిల్లలు, ఆయాలు పాల్గొన్నారు.

ప్రజల కలలు సాకారం

- బీఆర్‌ఎస్ సభలో ఎంపీ నామా
- మళ్లీ నేనే పోటీ చేస్తా: వనమా
- ఎమ్మెల్యేపై నామ, తుమ్మల ప్రశంసలు



ఆలింగనం చేసుకుంటున్న మాజీ మంత్రి తుమ్మల, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం క్లబ్‌లో మంగళవారం కొత్తగూడెం నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ప్రతినిధుల సభ జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు మోటార్ సైకిల్ ర్యాలీలతో సభా ప్రాంగణానికి చేరుకున్నారు. మొదట పార్టీ పతాకాన్ని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే వనమా అధ్యక్షతన జరిగిన సభలో బీఆర్‌ఎస్ పార్టీ పార్లమెంట్ ఫ్లోర్ లీడర్ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలలో దేశానికే రోల్‌మోడల్‌గా రాష్ట్రం నిలుస్తుంటే బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంపై వివక్ష చూపుతోందని విమర్శించారు. పన్నుల రూపంలో రాష్ట్రం నుంచి తీసుకోవడమే కానీ కనీసం 25 శాతం కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అభివృద్ధిలో కొత్తపుంతలు తొక్కుతూ రాష్ట్రం ప్రగతిపథంలో పయనిస్తోందన్నారు. ప్రజాభిమానాన్ని చూరగొన్న వనమాను మరోసారి నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. మంత్రిగా ఉన్నపుడు వనమాకు తమ్ముడిగా అభివృద్ధిలో తనవంతు సాయం చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్ ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి నేనే పోటీ చేయనున్నట్లు చెప్పారు. ప్రజాసేవే పరమావధిగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వివరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్, సొసైటీ చైర్మన్ మండే వీరహనుమంతరావు, టబీజీకేఎస్ నాయకులు కూసన వీరభద్రం, రజాక్, మాజీ జెడ్పీచైర్మన్ బరపటి వాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి జేవీఎస్ చౌదరి, ఉర్ధుఘర్ చైర్మన్ అన్వర్‌పాషా, కొట్టి వెంకటేశ్వర్లు, బాదావత్ శాంతి, కాసుల వెంకట్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో వనమా రాఘవేందర్‌రావు, ఎంఏ రజాక్, రావి రాంబాబు, బీమా శ్రీధర్, సంకుబాపన అనుదీప్, పాల్వంచ ఎంపీపీ సరస్వతి, సొసైటీ వైస్ చైర్మన్ జగన్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ శ్రేణుల మోటార్ సైకిల్ ర్యాలీ



హాజరైన ప్రతినిధులు

ఘనంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు



జూలూరుపాడు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో జెండా ఎగురవేస్తున్న సతీష్ కుమార్



టేకులపల్లి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..

జూలూరుపాడు: భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) పార్టీ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం జూలూరుపాడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీష్ కుమార్, భోజ్యాతండాలో సర్పంచ్ లావుడ్యా కిషన్‌లాల్‌తో కలిసి ఎంపీపీ లావుడ్యా సోనీ బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యల్లంకి సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి నున్నా రంగారావు, మోదుగు రామకృష్ణ, ఎస్కే మైబూ, యల్లంకి పుల్లయ్య, చాపలమడుగు రామ్మూర్తి, దేవరకొండ కిరణ్, పణితి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రామారావు, కాకర్ల సర్పంచ్ బానోత్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు మండలంలో ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ జెండాను మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రాధ, మండల ప్రధాన కార్యదర్శి బోడ బాలు, ఎంపీటీసీ అప్పారావు, సర్పంచ్‌లు బోడ సరిత, భూక్యా రతన్, ఉప సర్పంచ్ ఉండేటి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను వినియోగించుకోండి



ఇల్లెందురూరల్: కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఇల్లెందురూరల్: చల్లసముద్రం గ్రామపంచాయతీ పరిధిలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ తాటి చుక్కమ్మ మంగళవారం ప్రారంభించారు. మాట్లాడుతూ.. కంటి సంబంధిత సమస్యలు ఉన్నవారు విధిగా శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కుర్ర అరుణ, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ, నేత్ర వైద్యులు మునావర్ అలీ పాల్గొన్నారు.

జూలూరుపాడు: రెండో విడత కంటి వెలుగు పథకం జూలూరుపాడు మండలంలో కొనసాగుతోంది. మంగళవారం పడమటనర్సాపురం, కరివారిగూడెం గ్రామాల్లో కంటి వైద్యశిబిరాలను ప్రారంభించారు. పాపకొల్లులో కంటి వైద్యశిబిరం కొనసాగుతుండగానే మరో రెండు వైద్యబృందాలతో పడమటనర్సాపురం, కరివారిగూడెం గ్రామాల్లో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ కుమార్ తెలిపారు. ఆళ్లపల్లి, సుజాతనగర్ నుంచి రెండు వైద్యబృందాలు వచ్చాయన్నారు. డాక్టర్లు వెంకట్, వెంకటేశ్వర్లు, పూజ, హెచ్‌ఎస్ రత్నకుమార్, సర్పంచ్‌లు కట్రం మోహన్‌రావు, బోడా శాంతిరామ్, కాజా రమేష్ పాల్గొన్నారు.

ఏజెన్సీలో రిజర్వేషన్లు అమలు చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఏజెన్సీ ప్రాంతంలో ఎస్సీలకు రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి (ఎస్‌సీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. మాట్లాడుతూ... ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక ఎస్సీలకు 2014కు ముందు రిజర్వేషన్లు కొనసాగాయని ఇప్పుడు అమలు కావడం లేదని కలెక్టర్‌కు వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు జేబీ రాజు, గొల్లపల్లి దయానందరావు, సింగరేణి రిటైర్డ్ జీఎం ఆనందరావు, మద్దెల శివకుమార్, మందా హనుమంతు, కూసపాటి శ్రీనివాస్, కృపాకర్, యాకూబ్, సత్యం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నేడు దుకాణాలకు వేలంపాట

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయం వద్ద వివిధ వ్యాపారాల కోసం షాపులు అప్పగించేందుకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. ఉదయం 11గంటలకు బహిరంగ వేలం ప్రారంభమవుతుందని ఆమె పేర్కొన్నారు.

సింగరేణి బకాయిలు చెల్లించాలి

సింగరేణి(కొత్తగూడెం): ట్రాన్స్‌కో, జెన్కో సంస్థల నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవనాయక్ డిమాండ్ చేశారు. కొత్తగూడెం జేవీఆర్‌ఓసీలో మంగళవారం గేట్ మీటింగ్‌లో మాట్లాడుతూ... బొగ్గును అమ్మే క్రమాన బకాయిలు కూడా వసూలు చేయాలన్నారు. కాగా, గనుల వేలంపై ప్రైవేటీకరణ పేరుతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. టి.పవన్‌కుమార్, మొగిలిపాక రవి, సంగం చందర్, ఊట్ల గణేష్ పాల్గొన్నారు.

బస్టాండ్లు నిర్మించాలి

జూలూరుపాడు: మండల కేంద్రంలో బస్టాండ్‌ను నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా బస్టాండ్‌ను తొలగించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. తొలిగించిన బస్టాండ్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అదేవిధంగా ఇటీవల చంద్రుగొండ క్రాస్ రోడ్ వద్ద ఉన్న బస్టాండ్‌ను తొలగించారన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని బస్టాండ్లు నిర్మించాలన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌పై ఫిర్యాదు

పాల్వంచ: గుడిపాడు అంగన్‌వాడీ టీచర్ సరుకులు ఇవ్వడం లేదని, విద్యార్థులను దండిస్తోందని స్థానికులు మంగళవారం సీడీపీఓ కనకదుర్గకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్ సున్నం రాజ్యలక్ష్మి విద్యార్థులను దద్దులు తేలేలా కొడుతోందని, పాలు, గుడ్లు, పౌష్టికాహారం సరైన సమయంలో ఇవ్వడం లేదని, అడిగితే దురుసుగా సమాధానం ఇస్తోందని.. ఆమెను, ఆయాను మార్చాలని విన్నవించారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని కనకదుర్గ తెలిపారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ



పాల్వంచరూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో మంగళవారం పీహెచ్‌సీల ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇళ్ల పరిసర ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని డాక్టర్లు, వైద్యసిబ్బంది సూచించారు. మలేరియాను సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



టేకులపల్లి: ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డులో మానవహారంలో వైద్య సిబ్బంది



ఇల్లెందురూరల్: కొమరారంలో...



ఇల్లెందు: ర్యాలీ ప్రారంభిస్తున్న వైద్యసిబ్బంది



జూలూరుపాడులో...

మన సంక్షేమం అందరికీ ఆదర్శం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ, గ్రంథాలయ సంస్థ, మున్సిపల్ చైర్మన్లు దిండిగల, డీవీ తదితరులు

ఇల్లెందు: తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆదర్శంగా నిలిచాయని, ప్రపంచమే తెలంగాణ వైపు చూస్తోందని ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ అన్నారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావం సందర్భంగా మంగళవారం క్యాంపు కార్యాలయం వద్ద పార్టీ జెండా ఎగుర వేశారు. అనంతరం క్యాంపు కార్యాలయం నుంచి బీట్ మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇల్లెందు నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం, బీఆర్‌ఎస్ ప్రతినిధుల సభకు ఆమె అధ్యక్షత వహించి ప్రసంగించారు. మన రాష్ట్రంలో ఎన్నో పథకాలు పేదలకు సంజీవనిగా మారాయన్నారు. తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపినట్లే దేశాన్ని కూడా అభివృద్ధి పథంలో నడిపే రోజులు రానున్నాయని తెలిపారు. అనంతరం 15 తీర్మానాలను సభలో ప్రవేశపెట్టి అమోదించారు. వ్యవసాయరంగం, బీజేపీ వైఫల్యాలు, సింగరేణి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ తీర్మానం, పట్టణ, పల్లె ప్రగతి, పార్టీ నిర్మాణం, దేశ వ్యాప్తంగా బీఆర్‌ఎస్ ప్రచారం, కొత్త మండలాల ఏర్పాటు, డివిజన్ కేంద్ర ప్రకటన చేయాలని తీర్మానం ఆమోదించారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పాలని, సీతారామ ప్రాజెక్టు నిర్మాణం, విద్య ఉపాధి రంగాల మీద తీర్మానాలను సభలో సభ్యులు ప్రవేశపెట్టగా చర్చించి ఆమోదించారు.

సమావేశంలో మహబూబాబాద్ జెడ్పీ చైర్మన్ ఆంగోతు బింధు, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, సయ్యద్ జానీపాషా, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్, పులిగళ్ల మాధవరావు, ఎస్.రంగనాథ్, నాదెండ్ల శ్రీనివాసరెడ్డి, పరుచూరి వెంకటేశ్వరరావు, శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, మెట్ల కృష్ణ, హరిసింగ్ నాయక్, లాల్‌సింగ్, ఎంపీపీ నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు తీర్చాలి



ఖాళీబిందెలతో నిరసన తెలుపుతున్న శ్రీనివాసరెడ్డి, తదితరులు

సింగరేణి(కొత్తగూడెం): పట్టణ ప్రజల తాగునీటి కష్టాలను తీర్చాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వై.శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని 36వ వార్డు కూలీలైన్‌లో మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. తాగునీటి కోసం ప్రజలు ఇక్కట్లు పడుతున్నా అధికారులు, పాలకపక్షం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నట్లు చెబుతున్నా ప్రజలకు నీరు అందకపోవడంపై సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో కందుల జ్ఞానయ్య, దాసరి జ్యోతి, ఎం.బుచ్చిరాములు, కత్తెర రవీందర్, గద్దం రాజయ్య, సావిత్రి, కొలిపాక లక్ష్మి, రాజేశ్వరి, సృజన, శిరీష, శ్రీనివాస్, రాజు, ఉమ, రమేష్, కోటయ్య, నాగయ్య పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయండి



స్వర్ణలతకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

సింగరేణి(కొత్తగూడెం): అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ టీచర్స్‌కు సుప్రీంకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ఇచ్చి సంవత్సరం అవుతున్న నేపథ్యంలో మంగళవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో సీడీపీఓ స్వర్ణలతకు వినతిపత్రం అందజేశారు. మహిళా నాయకురాళ్లు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ గ్రాట్యూటీ చట్టాన్ని అమలు చేసి టీచర్స్, హెల్పర్స్‌ను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కే.సత్యవతి, కోశాధికారి వెంకట రమణ, ఆఫీస్ బేరర్ చుక్కమ్మ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పట్టాలు పంపిణీ చేయండి

సుజాతనగర్: ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ ద్వారా తమకు పట్టాలు పంపిణీ చేయాలని కోరుతూ లెనిన్ నగర్ గ్రామస్తులు డిప్యూటీ తహసీల్దార్ యు.సునీల్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా గ్రామంలో నివాసం ఉంటున్నా తమకు పట్టాలు ఇవ్వకపోవడం తగదన్నారు. జీఓ నెంబర్ 58, 59 ద్వారా పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. గొలుసుల నరసింహారావు, ఓర్సు ఉపేందర్, చల్ల అచ్చయ్య పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో కొత్తగూడెం ఏరియా పరిధిలోని సెక్యూరిటీ గార్డుల సమస్యలను పరిష్కరించాలని పలువురు నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రమణారెడ్డికి ఏరియా ఉపాధ్యక్షుడు ఎం.డీ.రజాక్ తదితరులు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సుద్దాల నరసింగం, మోహన్‌రెడ్డి, మైస రాజేష్, వీరస్వామి, హనుక్‌రాజ్, విజయ్‌కుమార్, సుబ్బారావు, త్రిపాఠి, గులాం గౌస్, చంద్రమోహన్, కుమారస్వామి, అశోక్, ప్రశాంత్, రాజేశ్వరరావు, పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు.

దిమ్మెలు తొలగించాలి

పాల్వంచరూరల్: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో చర్చి ఎదుట ఇటీవల కొందరు ఏర్పాటు చేసిన వన దేవతల దిమ్మెలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని క్రైస్తవ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమ్మద్ అలీకి డాక్టర్ విల్సన్ సింగం, తదితరులు వినతిపత్రం అందజేశారు.

ఆక్సిజన్ పాయింట్లు అందజేత

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం 8వ వార్డులోని మాతాశిశు సంరక్షణ కేంద్రానికి నవ లిమిటెడ్, ప్వాలంచ నిర్వాహకులు మంగళవారం 42 ఆక్సిజన్ పాయింట్లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కుమారస్వామికి అందజేశారు. ఆర్ఎం దయానంద స్వామి, చీఫ్ లైజనింగ్ ఆఫీసర్ పి.ఖాదరేంద్రబాబు, చీఫ్ అడ్మినిస్ట్రేటర్ డి.శ్యాంసుందర్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీ

జూలూరుపాడు: క్షయ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడేలా వైద్యసిబ్బంది కృషి చేయాలని జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాస్ ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. టీబీ అనుమానితుల నుంచి తెమడ శాంపిల్స్‌ను సేకరించి జిల్లా ఆసుపత్రికి పంపించాలని వైద్యులకు సూచించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ రాకేష్ కుమార్, ప్రదీప్తి, ల్యాబ్ టెక్నీషియన్ ఎస్కే హఫీజ్, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎస్ రత్నకుమార్, హెల్త్ అసిస్టెంట్ జానకిరామ్ పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

టేకులపల్లి: 108 అంబులెన్స్‌లో మంగళవారం ఓ మహిళ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వివరాలు.. బేతంపూడి పంచాయతీ వెంకట్యాతండాకు చెందిన డి.సంధ్య తెల్లవారుజామున పురిటి నొప్పులతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. టేకులపల్లి నుంచి వాహనం వచ్చేసరికి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో పైలట్ కేవీ రామారావు అంబులెన్స్‌లోనే డెలివరీ చేశారు. వీరిని సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా సీసీ రోడ్డు

రూ.కోట్ల వ్యయం చేసి పర్యాటకుల సౌకర్యార్థం నిర్మించిన సీసీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. మండలంలోని కిన్నెరసానిలో బోటింగ్ పాయింట్ నుంచి అద్దాల మేడ వైపు రాకపోకలు సాగించేందుకు సీసీ రోడ్డును ఇటీవల నిర్మాణం చేశారు. కానీ సైడ్‌బరమ్స్‌ను మట్టితో నింపకపోవడం వలన ప్రమాదకరంగా మారింది. పర్యాటకులు నిత్యం ఈ రోడ్డుపై వాహనాల రాకపోకలు సాగిస్తారు. అధికారులు స్పందించి సైడ్ బరమ్స్ మట్టితో నింపాలని పర్యాటకులు కోరుతున్నారు.

– పాల్వంచరూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : రవీందర్, పర్యాటకశాఖ, డీఈ
సెల్ నంబర్ : 8096660189